## కలుషిత నీటి సమస్య పరిష్కారం

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో నెలకొన్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. స్థానికంగా నెలకొన్న కలుషిత నీటి సమస్యతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్పొరేటర్ జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన జలమండలి బర్కత్‌పుర సెక్షన్ మేనేజర్ ఏఈ భావన క్యూఐడబ్ల్యూపీఎస్ కెమెరా మిషన్ ద్వారా నల్లాల్లో నీరు కలుషితం అవుతన్న ప్రాంతాన్ని సోమవారం గుర్తించారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నేతలు సంతోష్, బి.భీమ్ రాజ్, కృష్ణ, సత్యనారాయణ, రవియాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం



ఉమామహేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

చిక్కడపల్లి: వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో ఉమామేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాసశివ రాత్రి సందర్భంగా ఘృతశర్కాభిషేకం కార్యక్రం జరిగింది. ఆలయంలో బిల్వార్చన, అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో పండితులు భవానంద శర్మ, జగన్‌మోహనాచార్యులు, బుచ్చమాచార్యులు, గోపాలాచారి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

# శివోహం..

### కార్తీక మాసం చివరి సోమవారం ఆలయాలు కిటకిట



న్యూరామాలయ ప్రాంగణంలోని పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

- శివాలయాలకు పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాల నిర్వహణ



నల్లకుంట శంకరమఠంలో హెడ్ కృష్ణారావు, నేషనలిస్టు కాంగ్రెస్ అధికార ప్రతినిధి ప్రవీణ్ కుమార్

నల్లకుంట: కార్తీక మాసంలో చివరి సోమవారం సందర్భంగా నల్లకుంటలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు దైవ దర్శనం కోసం ఆలయాల వద్ద బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. నల్లకుంటలోని లింగాల గడ్డ శివాలయం, న్యూ రామాలయం ప్రాంగణంలో ఉన్న పర్వత వర్ధిని సహిత రామలింగేశ్వర ఆలయం, బీరప్ప ఆలయం, తిలక్‌నగర్‌లోని శివాలయం, శివం మందిరం, శంకరమఠం తదితర ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

◆ ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో మహాశివుడికి పంచామృతాభిషేకాలు కావించి అర్చనలు, హారతులు ఇచ్చారు. న్యూనల్లకుంట రామాలయం ప్రాంగణంలోని శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం అర్చక స్వాములు శివుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివుడిని వివిధ రకాల పూల మాలలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆది దంపతుల దర్శనం కోసం పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.



**శంకరమఠంలో...**

కార్తీక మాసంలో చివరి సోమవారం సందర్భంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యువ భారత్ చైర్మన్ వైద్య ప్రవీణ్ కుమార్ నల్లకుంట శంకరమఠంలోని శారదాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిర్వహించిన చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మఠం నల్లకుంట శాఖ హెడ్ కృష్ణారావుని కలిసిన ఆయన మఠం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన తోడ్పాటునందించేలా చూస్తానని చెప్పారు. సాయి, విజయ్, రాము, రంజిత్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### లక్ష్మీగణపతి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో..

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఉన్న శివాలయంలో కార్తీక మాసం చివరి సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని దేవాలయంలో ప్రాంగణంలో ఉన్న క్షీర లింగేశ్వరాలయంలో ఉదయం మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం, ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మలు, లక్ష్మీగణపతి ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో పి.లక్ష్మారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ధర్మకర్తలు డాక్టర్ టి.రామకృష్ణ, మురికి గణేశ్, డాక్టర్ జి.కె.రమణ, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతిశర్మ, భవనంద శర్మ, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

### నేత్రపర్వం.. శివ పార్వతుల కల్యాణం

ముషీరాబాద్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా భోలక్‌పూర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ భవానీ శంకర ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈవో జ్యోతి వేదపండితులతో కలిసి శివపార్వతుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రధాన అర్చకులు విజయ్‌కుమార్‌శర్మ, రామకృష్ణలచే స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అంతకు ముందు చండీ హోమం, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది సురేష్ కుమార్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



శివపార్వతుల విగ్రహాలను తీసుకొస్తున్న ఈవో జ్యోతి, వేద పండితులు



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

## ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి

ముషీరాబాద్: మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల సంఖ్యను వెంటనే పెంచాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే తపనతో ముందస్తు ప్రణాళిక లేకుండా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి ఆర్టీసీ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. బస్సులలో అధిక రద్దీ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం అన్ని వర్గాల ప్రజలకు అమలయ్యేలా ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లు, ఉబర్, ఓలా, రాపిడో ద్వారా ఉపాధి పొందుతున్న నిరుద్యోగులకు ఉపాధి కరువై ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జీవనోపాధి కల్పిస్తున్న ఈ రంగాల్లో ఉన్న వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం ప్రజలకు స్పష్టత ఇచ్చి ఎప్పుడు అమల్లోకి వస్తుందో వెల్లడించాలని కోరారు.

## కాంగ్రెస్ చరిత్ర ఆద్యంతం అవినీతిమయం

**బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు**

కాచిగూడ: ఝార్ఖండ్ ఎంపీ ధీరజ్ సాహూ ఇంటిపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు జరిపిన సోదాల్లో 290 కోట్ల రూపాయల అక్రమ సొమ్ము స్వాధీనం చేసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అవినీతి చరిత్ర బహిర్గతమైందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఘటన ద్వారా అవినీతి, అక్రమాలకు కాంగ్రెస్ పార్టీ పుట్టి అనే విషయం మరోసారి రుజువైందన్నారు. కాంగ్రెస్‌కు అవినీతికి వీడదీయలేని బంధం ఉందన్నారు. యూపీఏ హయాంలో రూ. లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు చోటు చేసుకున్నాయని అన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో అవినీతి ఉక్కుపాదంతో అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటుంటే... అవినీతి ఊబిలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తోందన్నారు.

**నేడు బీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు..**

కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమ చర్యలను నిరసిస్తూ ఈ నెల 12న (మంగళవారం) జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కార్పొరేషన్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

చిక్కడపల్లి: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. సోమవారం సాయంత్రం గాంధీనగర్ విలేకరులతో పుస్తకాల కవిత మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు సూచనల మేరకు గతంలో ఇక్కడ అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాలలో ఆందోళనలు చేశామన్నారు. దశాబ్దకాలం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. మహిళా కాంగ్రెస్ చేసిన కృషిని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కార్పొరేషన్ చైర్ పర్సన్, కమిటీ సభ్యులు నియామకాలలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మహిళా కాంగ్రెస్ ఎన్నో పోరాటాలు చేసిందని, తెలంగాణ రాష్ట్ర సాధనకో ఎంతో కృషి చేసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు.

## చోరీకి గురైన ఖరీదైన సెల్‌ఫోన్లు స్వాధీనం

చిక్కడపల్లి: దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ గురైన ఖరీదైన 12 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న ఆ సెల్‌పోన్లను వాటి యజమానులకు ఏసీపీ రవి కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిల చేతులమీదుగా సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ... బాధితుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి ఆ 12 సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేశామన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆందోళన చెందకుండా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే చాలని, పోయిన ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితులకు అందజేస్తామని ఆయన చెప్పారు. ఒకవేళ సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయటం తెలియకపోతే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదు మేరకు వెంటనే ఫోన్‌లను ట్రేసి చేసి బాధితులకు అందించిన దోమలగూడ క్రైం సిబ్బందిని ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, డీఐ వరప్రసాద్, డీఎస్ఐ శ్రీకాంత్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

కాచిగూడ: ఆర్టికల్ 370పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కేంద్రంలోని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వానికి ఒక గొప్ప కలికితురాయి అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. సోమవారం కాచిగూడలోని తన నివాసంలో గీతామూర్తి మాట్లాడుతూ... దేశంలో ఉన్న 23 మంది ప్రముఖ లాయర్ల వాదనతో ఏకీభవించిన సుప్రీం కోర్టు సరైన తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370పై కేంద్ర నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. భారత దేశంలో కశ్మీర్ విలీనమైనప్పుడు ప్రత్యేక హోదాలేవీ లేవని, కశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదని కోర్టు చెప్పిందని గీతామూర్తి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టు సమర్థిస్తూ దేశంలో మిగిలిన రాష్ట్రాలతో జమ్ము కశ్మీర్ సమానమని, ఆర్టికల్ రద్దు వెనుక కెలాంటి దురుద్దేశం లేదని జడ్జీలు పేర్కొన్నారని గీతామూర్తి చెప్పారు.

**తీర్పును స్వాగతిస్తున్నాం..**

ఆర్టికల్ 370పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర లా స్టూడెంట్స్ ఫోరమ్ కన్వీనర్ కొండ సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నుంచి జమ్మూ కశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడులు మనం కనులారా చూశామని, ఎప్పుడు చూసినా ఏదో ఒక గొడవలు జరుగుతూనే ఉండేవని అన్నారు. గొడవలను ఆపాలని కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించిన 370 ఆర్టికల్ బిల్లును సుప్రీం కోర్టులో రాజ్యాంగపరంగా మద్దతిచ్చిన తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని అన్నారు. ఏబీవీపీ నేతలు సాయి తేజ, మహేందర్, రోహన్, ప్రేమ్, మణి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పడిపూజా సామగ్రి పంపిణీ అభినందనీయం



పూజా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, తలారి వినోద్‌కుమార్ గురుస్వామి

ముషీరాబాద్: హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సంస్థ నిర్వాహకులు తలారి వినోద్‌కుమార్ గురుస్వామి 20 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములు నిర్వహించే శ్రీ అయ్యప్ప స్వామి పూజల కోసం 110 సెట్లను తయారు చేసి ఉచితంగా అందజేస్తుండటం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం రాంనగర్‌లోని తన కార్యాలయంలో వినోద్‌కుమార్ గురుస్వామి అయ్యప్ప స్వాములకు 110 పూజా సెట్ల ఉచిత పంపిణీ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ పడిపూజ సెట్లను అయ్యప్ప స్వాములకు అందజేశారు. తలారి వినోద్‌కుమార్ గురుస్వామి మాట్లాడుతూ... 2017 ఎన్‌టీఆర్ స్టేడియంలో ఒకేసారి 108 పడిపూజలు చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పామని గుర్తుచేశారు. ఇప్పటి వరకు 11 అవార్డులు లభించాయన్నారు. బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, తలారి శ్రీకాంత్‌ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, సుధాకర్‌గుప్తా, శివ ముదిరాజ్, వై.శ్రీనివాస్, రమణాచారి గురుస్వామి, సుశీలమ్మ, చరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'మాజీ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలి'



మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మాజీ డీజీపీ అంజనీకుమార్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం 2015ను నిర్వీర్యం చేస్తూ జారీ చేసిన సర్క్యులర్ నెంబర్ 3340/2023ని వెంటనే రద్దు చేయాలని నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంప్రసాద్ మాట్లాడుతూ... 2018లో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన సుప్రీం కోర్టుకు వ్యతిరేక ఉద్యమంలో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేసిన మాజీ డీజీపీ అంజనీకుమార్‌పై సెక్షన్ 4 ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక సవరణ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంజనీకుమార్ కుట్రపూరితంగా 30 శాతంకు పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కవచంగా ఉన్న ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తు సర్క్యులర్ జారీ చేశారని ఆరోపించారు. జనరల్ లాకు సంబంధించిన సుప్రీం కోర్టు ఆదేశాలంటూ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ లాకు ఆపాదిస్తు 2/8/2003న సర్క్యులర్ నెంబర్ 3340/2023ను జారీ చేసి రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్ ఆఫీసులకు ఉత్తర్వులు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సర్క్యూలర్‌కు వ్యతిరేకంగా అన్ని జిల్లా కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, కమిషనర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీఎంసీ కన్వీనర్ ఎస్.శివలింగం, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో



అంబేద్కర్ కళాశాలలో జరిగిన ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో పాల్గొన్న విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల్లో ఎంబీఏ, డిగ్రీ, ఇంటర్ మీడియట్, ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో (నూతన ఆవిష్కరణ ప్రదర్శన) ఘనంగా ముగిసింది. ఎక్స్‌పోలో పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. మూడు వేలు, ద్వితీయ బహుమతిగా రూ. రెండు వేలు, తృతీయ బహుమతిగా వెయ్యి రూపాయలతో అభినందించారు. ప్రథమ బహుమతి వైర్‌లెస్ డిజిటల్ బ్రోర్డుకు, ద్వితీయ బహుమతి ఆపరేటర్ మోడల్ ట్రీ, తృతీయ బహుమతి ఇస్రో చంద్రయాణ్ మోడల్స్‌కు అందించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ పి.వి.రమణకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు అనుకుంటే అసాధ్యమంటూ ఏదీ లేదన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భవానీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, పాఠశాల ప్రిన్సిపాల్ విఠలాచారి తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

### వ్యక్తి అదృశ్యం



పరమేశ్

అంబర్‌పేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ సమాచారం మేరకు... అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్‌లో నివాసించే జి.పరమేశ్‌కుమార్(45) జీహెచ్‌ఎంసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. ఈ నెల 10వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయా ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేనందున పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

### యువతి అదృశ్యం

చిక్కడపల్లి: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైనంది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సాయికృష్ణ సమాచారం మేరకు... హిమాయత్‌నగర్‌లో నివసించే సుజ్జన్‌లాల్, సావిత్రి దంపతులకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మూడవ కుమార్తె అర్చన(18) ఇళ్లలో పని చేస్తూ ఉండేది. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన సాయంత్రం సుష్మ వాళ్ల ఇంట్లో పనిచేసేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే అర్చన ఎంతకూ ఇంటికి తిరిగి రాలేదు. పనికి కూడా సుష్మ ఇంటికి వెళ్లలేదని తెలిసింది. దీనితో కంగారు పడిన కుటుంబ సభ్యులు దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రాకేశ్‌కుమార్, నాయకులు

చిక్కడపల్లి: గడిచిన ఐదు సంవత్సరాల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు ప్రజలు మరోసారి ఓట్లు వేసి భారీ మెజార్టీని అందిచడం అభినందనీయం అని బీఆర్‌ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాకేష్‌కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. నాయకులు శ్రీకాంత్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, ఆనంద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి



విజయ భవన్ వద్ద బైఠాయించిన పాడి రైతులు

లాలాపేట: తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ)కు చెందిన పాడి రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో పాల బిల్లులు చెల్లించక మూడు నెలలు కావొస్తుంది. ఈ విషయమై స్థానిక అధికారులను అడుగగా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ మెదక్ జిల్లాకు చెందిన కొందరు పాడి రైతులు సోమవారం లాలాపేటలోని విజయ పాలనాభవన్ వద్దకు చేరుకున్నారు. పాల బిల్లులపై అధికారులెవరూ స్పందించకపోవడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. మధ్యాహ్నం అనంతరం విజయ డెయిరీ అధికారి జనరల్ మేనేజర్ కామేష్ లోపలికి పిలిపించి పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పాడి రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో అరవిందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, భాస్కర్, రాజు తదితరులున్నారు.

## శ్రీదుర్గా హైస్కూల్‌లో లీడ్ కాన్ఫరెన్స్

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట లక్ష్మీనగర్‌లోని శ్రీ దుర్గా హైస్కూల్‌లో సోమవారం లీడ్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైమరీ విద్యార్థులు వివిధ పాఠ్యాంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. లీడ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఏడాదిలో రెండు సార్లు ఈ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలపై యాక్టివిటీ ద్వారా విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు.

# భారీగా ట్రాఫిక్ జామ్

- అనూహ్యంగా ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- నగరంలో వాహనదారుల ఇక్కట్లు

లక్డీకాపూల్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ముఖ్యంగా లక్డీకాపూల్‌లోని మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 12 గంటల ప్రాంతంలో అనూహ్యంగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఎటూ కదలకుండా ఉన్న చోటే వాహనదారులు ఆగిపోయారు. ప్రముఖుల రాకపోకల నేపథ్యంలో ఈ సమస్య ఏర్పడింది. ఫలితంగా అసెంబ్లీ ప్రాంతం నుంచి లక్డీకాపూల్ చౌరస్తాతో పాటు నిరంకారి భవన్ చౌరస్తా, తెలుగు తల్లి ఫ్లైఓవర్, విజయనగర్ కాలనీ, ఖైరతాబాద్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చేస్తున్న అక్రమ వ్యాపారాలు వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురచేశాయి. ముఖ్యంగా లక్డీకాపూల్ ప్రాంతంలో ఈ సమస్య మరింత జటిలంగా తయారైంది. లక్డీకాపూల్ పాత రాజ్‌దూత్ హోటల్ చౌరస్తాలోని హోటళ్ల వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు జోక్యం చేసుకుని ఫుట్‌పాత్ వ్యాపారాలను క్రమబద్ధీకరించాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు. లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ భవన సముదాయానికి హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను తరలించిన నేపథ్యంలో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. కలెక్టరేట్ నుంచి వచ్చే వాహనాలు కొత్త వంతెన వైపు వెళ్లే సమయంలో ఇబ్బంది ఏర్పడకుండా జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల డీజీపీ కార్యాలయం నుంచి వచ్చి నిరంకారి వైపు వెళ్లే వాహనాలు ఆగిపోతున్నాయి. మరో వైపు హైదరాబాద్ కలెక్టరేట్ వైపు నుంచి వచ్చిన వాహనాలు సైతం కొత్త వంతెన పైకి వెళ్లే యత్నంలో జంక్షన్ వద్ద ఆగిపోతున్న పరిస్థితి. దీంతో మెహిదీపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలు నేరుగా వెళ్లేందుకు ట్రాఫిక్ పోలీసులు వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలోనే లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తరుచుగా ఏర్పడే ట్రాఫిక్ జామ్ సమస్యలకు చెక్ పెట్టాలని పలువురు వాహనదారులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మారుమూల ప్రాంతాల్లోనూ మానసిక ఆరోగ్య కేంద్రాలు అవసరం

బంజారాహిల్స్: మారుమూల ప్రాంతాల్లో కూడా మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ డీఎంఈ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రిక్ అపోలో మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజీలో మానసిక సేవలను స్థాపించడం అనే థీమ్‌తో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ... ఎంతో మంది నిపుణులు ఈ సదస్సుకు వచ్చారని మన దేశంలో ఉన్న పరిమితులు, మనో రోగ చికిత్స సేవలు తెలుసన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ బోధనా సంస్థల్లో ఇటువంటి నిపుణులు ఎంతో మంది ఉన్నారన్నదే ప్రశ్న అన్నారు. మానసిక వైద్యం కళాశాలలకే పరిమితం అయిందని అక్కడ కూడా పూర్తి స్థాయిలో లేదన్నారు. డాక్టర్ అరబింద బ్రహ్మ, అశోక్, నేహా మహేంద్ర, నరేష్ వడ్లమాని తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి చిల్డ్రన్స్ ఆర్ట్ ఫెస్టివల్

లక్డీకాపూల్: చిన్నారుల్లో వినూత్నమైన కళల పట్ల ప్రోత్సహించే దిశగా నగరంలో మూడు రోజుల పాటు చిల్డ్రన్స్ ఆర్ట్ ఫెస్టివల్ -2023 నిర్వహించనున్నారు. చిల్డ్రన్స్ ఫైన్ ఆర్ట్ గ్యాలరీతో కలిసి కొల్లూరులోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన కళలు, సంస్కృతికి ప్రతీకగా నిలవనున్నది. ఈ నెల 21వ తేదీ నుంచి స్కూల్ ఆవరణలో జరిగే ఈ ప్రదర్శన చిన్నారులతో పాటు ప్రఖ్యాత చిత్రకారులు, ఆర్ట్ ప్రాక్టీషనర్లు, ఉపాధ్యాయులకు వేదిక కానున్నది. వర్క్‌షాప్‌లు, ఇంటరాక్టివ్ ఇన్‌స్టాలేషన్, ఆకర్షణీయమైన చిత్ర ప్రదర్శనలతో నగరవాసులను అలరించనున్నదని స్కూల్ నిర్వాహకులు పేర్కొన్నారు.

## రూ.5 లక్షల ఆశచూపి రూ. 58 వేలు స్వాహా

అడ్డగుట్ట: ఆన్‌లైన్‌లో పర్సనల్ లోన్ ఆశ చూపించి రూ. 58 వేలు కాజేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌లోని సాయినగర్ ప్రాంతానికి చెందిన అనీల్ (46) ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల ఫేస్‌బుక్ చూస్తుండగా ఇండియా బుల్స్ ఫైనాన్స్ అనే యాప్‌లో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అనీల్ అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా రూ.5 లక్షల లోన్ మంజూరైనట్లు చెప్పారు. లోన్ అప్రూవల్ కోసం కొంత డబ్బు కంపెనీకి చెల్లించాలని మాయమాటలు చెప్పి సుమారు రూ. 58 వేలు అనిల్ ద్వారా కట్టించుకున్నారు. రోజులు గడుస్తున్నా లోన్ ఇవ్వక పోవడం, ఫైనాన్స్ యాప్‌కు సంబంధించిన వాళ్లు స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి సోమవారం పోలీసులకు ఆశ్రయించాడు.